ప్రజాశక్తి

మంగళవారం 15 ఏప్రిల్ 2025 | 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

మళ్లీ మద్యం టార్గెట్లు.!

- సరుకు ముందే కొనాలని అధికారుల ఒత్తిళ్లు
- గతంలో చంద్రబాబు హయాంలో విధానమే మళ్లీ తెచ్చిన వైనం..
- మద్యం దుకాణాల పక్కనే షెడ్లు
- అక్కడే కూర్చోబెట్టి తాపుతున్న నిర్వాహకులు



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

మద్యంపై మళ్లీ పాత పద్ధతులే ఆరంభమయ్యాయి. ఆదాయం కోసం ఎక్కువ మద్యం అమ్మకాలను రాష్ట్ర ప్రభుత్వం గుట్టుగా ప్రోత్స హిస్తోంది. నాణ్యమైన మద్యం అనే పేరుతో మద్యం ఏరులై పారే విధా నానికి రాష్ట్ర ప్రభుత్వం తెర లేపింది. కొత్త మద్యం పాలసీతో మద్యం దుకాణాలన్నీ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిన

▶ 2లో



బాపట్లలో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే

సామాజిక, ఆర్థిక సాధికారతతోనే సమానత్వం

- బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్
- అంబేద్కర్‌కు ఘన నివాళి

8లో ▲



మట్టితరలిస్తున్న టిప్పర్

అక్రమంగా మట్టి తరలింపు

ప్రజాశక్తి- సిఎస్ పురంరూరల్ : బి కవి గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణం కోసం మండల పరిధిలోని ముండ్లపాడు చెరువు నుంచి మట్టిని తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలించడంపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అక్రమంగా మట్టి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇరిగేషన్ శాఖ ఎఇ దగ్గరుండి మట్టిని తోలిస్తున్నారని అభ్యంతరం చెప్పిన వారిపై దౌర్జన్యం చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. ఇరిగేషన్ చెరువులో మట్టి తోలుకునేందుకు తాము అనుమతి ఇచ్చామని అభ్యంతరం చెప్పడానికి మీరు ఎవరు అని ఎఇ ప్రశ్నిస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెరువు నుంచి మట్టి తరలింపును అరికట్టాలని ముండ్లపాడు, డిసిపల్లి గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ శాఖ ఎఇ వినయ్ కుమార్‌ను ప్రజాశక్తి వివరణ కోరగా ఈ విషయం తనను అడగ వద్దని మట్టి తోలుకునేందుకు ఇఇ పరిమ్మిషన్ ఇచ్చినట్లు తెలిపారు. ఇఇ శివప్రసాద్ ను వివరణ కోరగా గ్రామస్తులు, ఎమ్మెల్యే అనుమతి తీసుకుని పర్మిషన్ ఇచ్చినట్లు తెలిపారు. గ్రామస్తులకు అభ్యంతరం ఉంటే డిఇని పంపి మాట్లాడుతామని పేర్కొన్నారు.

వైభవంగా గుంటి గంగమ్మ తిరునాళ్ల

ప్రజాశక్తి-తాళ్ళూరు

మండల పరిధిలోని తూర్పు గంగవరం వద్ద ఉన్న గుంటి గంగమ్మ తిరునాళ్ల సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్ కె.గురుబ్రహ్మం, ఇఒ వాసు ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శి డిఎస్‌పి బి.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సిఐ వై.రామారావు పర్యవేక్షణలో



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి





ఎస్‌ఐలు మల్లికార్జున, మురళి, కమలాకర్, శివ, సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా ఆరు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. నాగం బొట్లపాలెం టిడిపి ఆధ్వ ర్యంలో ఒకటి, తురకపాలెంలో టిడిపి ఆధ్వర్యంలో ఒక విద్యుత్ ప్రభ ఏర్పాటు చేశారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఒకటి, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మరో విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు.



పూజలు నిర్వహిస్తున్న గొట్టిపాటి లక్ష్మి

గొట్టిపాటి లక్ష్మి ప్రత్యేక పూజలు

గుంటి గంగాభవాని అమ్మవారిని టిడిపి దర్శి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ లక్ష్మీ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ కుంటుపల్లి వాసు, ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.గురుబ్రహ్మం, టిడిపి మండల అధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబులరెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మళ్లీ మద్యం టార్గెట్లు.!

(మొదటిపేజీ తరువాయి)

సంగతి తెలిసిందే. గత ప్రభుత్వం మాదిరిగా మద్యం అమ్మే పని కూటమి ప్రభుత్వం పెట్టుకోలేదు. అయితే చంద్రబాబు గతంలో ఎలాంటి విధానాన్ని అవలంభించారో ఇప్పుడూ దాన్నే పాటిస్తున్నారు. మళ్లీ మద్యం టార్గెట్లు తెరపైకి వచ్చాయి. దుకాణాల యజమానులపై ముందుగానే డీడీలు తీసి పంపాలని ఒత్తిళ్లు చేస్తున్నారు. జనం కొన్నా, కొనకపోయినా నెలనెలా ఇన్ని కేసులు మద్యం గోదాముల నుంచి తీసుకుపోవాల్సిందేనని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. దీంతో యజమానులుగా ఉన్న పాలకపక్ష నేతలు తలలు పట్టుకుంటున్నారు. దుకాణం నిండా మద్యం ఉన్నా మళ్లీ డిడీలు కట్టి కొత్త సరుకు తెచ్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. అమ్ముకుంటారో, లేదో తమకు తెలియదనే ధోరణిలో అధికారులున్నారు. దుకాణాల చుట్టూ తిరిగి డీడీలు కట్టించి సరుకు పంపుతున్నారు. దీని వల్ల రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు డబ్బులు వస్తాయి. దాంతోనే పాలన సాగించాల్సిన పరిస్థితి వచ్చింది.

జిల్లాలో 175 దుకాణాలున్నాయి. వీటి నుంచి ప్రారంభంలోనే కోట్లాది రూపాయల ఫీజులు రాబట్టారు. గ్రామాల్లో 50 లక్షల వరకూ దుకాణం లైసెన్సు ఫీజు చెల్లించారు. అక్కడ నుంచి పట్టణాలకు వెళ్లేసరికి ఇంకా పెరిగింది. అప్పట్లో రూ.వంద కోట్లకు పైగానే వచ్చింది. ఇప్పుడు దుకాణాల ద్వారా సరుకు ఎక్కువ అమ్ముకునేలా ఒత్తిళ్లు పెరిగాయి. ఇప్పటికే మద్యం దుకాణాల్లో 90 శాతం మంది నష్టాల్లో ఉన్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఎమ్మెల్యేల్లోనూ ఇదే చర్చ నడుస్తోంది. ప్రస్తుతం 13 శాతం కమీషన్ ఇస్తున్నారు. దీన్ని పెంచాలని మొదట్లో గట్టిగానే డిమాండ్ చేశారు. ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎక్కువ ధరలకు అమ్మే యత్నం చేశారు. అదీ ఫలించలేదు. బెల్టు దుకాణాలు పెట్టుకొని మద్యం ఎక్కువ అమ్ముకుంటున్నారు. ఎక్కువ సరుకు అమ్ముడుపోతే గిట్టుబాటు అవుతుందని భావించారు. ఐనా కూడా నష్టాల్లోనే ఉన్నామని చెబుతున్నారు. ఇప్పుడు సరుకు ముందుగానే తీసుకుపోవాలని, అందుకు డీడీలు కట్టాలనే ఒత్తిళ్లు పెరిగాయి. మండలాల్లో ఉన్న దుకాణాలు రోజుకు సగటున లక్షన్నర వరకూ అమ్మకాలు సాగుతున్నాయి. ఒక్కో దుకాణంలో నెలకు రూ.40 లక్షల నుంచి రూ.80 లక్షల వ్యాపారం సాగుతోంది. ఇది ప్రాంతాలను బట్టి ఉంది. ఇదే స్థాయిలో సరుకును ముందుగానే కొనాలనే ఒత్తిళ్లు పెరిగాయని వ్యాపారులు వాపోతున్నారు. దీని వల్ల ఇటు వ్యాపారులు ఆర్థికంగా ఇంకా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే దుకాణాల లైసెన్సుల ఫీజులు భారీగా కట్టారు. వాటికి వడ్డీలు చూసుకుంటే మిగిలేదేమీ లేదనే చర్చలో ఉన్నారు. కొందరు సిండికేట్‌గా మారి ఒక్కో దుకాణాన్ని రూ.50 లక్షలకు పైగానే వెచ్చించి కొన్నారు. పైగా అధికారులకు నెలకు లక్ష రూపాయల వరకు మామూళ్లు ఇస్తున్నారు. ఇవన్నీ రాబట్టుకోవాలంటే కొనుగోళ్లు పెంచుకోవాలి. అంటే తాగించే ప్రక్రియ పెరగాలి. అందుకే ఎక్కువ చోట్ల దుకాణాల పక్కనే పెద్దపెద్ద షెడ్లు వేశారు. అక్కడే టేబుళ్లు వేశారు. ఇంకేముందీ మందుబాబులు అక్కడే తాగి పడిపోతున్నారు. లక్ష్యం ఒక్కటే.. మద్యం ఎక్కువగా తాగించడం. అదే విధంగా ప్రభుత్వ గోదాముల నుంచి మద్యం ముందుగానే తీసుకుపోవడం. ఇలా తెచ్చిన మద్యాన్ని ఏదోమార్గంలో అమ్ముడం. ఇదే ఇప్పుడు జరుగుతోంది. విచ్చలవిడిగా మద్యం దుకాణాలు రహదారుల పక్కనే పెడుతున్నారు. జాతీయరహదారికి కిలోమీటరు దూరంలో గతంలో దుకాణాలున్నాయి. ఇప్పుడు దుకాణాలు జాతీయరహదారి పక్కనే పెట్టేశారు. లారీల డ్రైవర్లు తాగిన వెంటనే డ్రైవింగులోకి వెళ్లిపోతున్నారు. ప్రమాదాలు పెరిగాయి. ఎన్ని మాటలు చెప్పినా మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలు ఆగుతాయా? అన్నదీ ఆలోచించడం లేదు. ఏదేమైనా మద్యం ఏరులై పారేలా ఎక్సైజ్ శాఖ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోంది.

తులసిరెడ్డికి ఘన స్వాగతం

ప్రజాశక్తి - పామూరు

మండల పరిధిలోని వగ్గంపల్లె గ్రామానికి రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ ఎస్.తులసి రెడ్డి సోమవారం విచ్చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పిల్లి వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో మేళ తాళాలలో ఘన స్వాగతం ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులు, కడప కాంగ్రెస్ నాయకులు అమర్, ఉత్తన్న, ఐచర్ రమణ,నాగరాజు అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఒడ్డున నిలిపి ఉన్న పడవలు

ఒడ్డుకు చేరిన పడవలు

సముద్రంలో నిలిచిన వేట

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నం మండలంలో మత్స్య సంపద వృద్ధి కొరకు ఈనెల 15 నుంచి జూన్ 14 వరకు వేట నిషేధించడం జరిగింది. మత్స్యకారులు ఈ వేట లేని సమయంలో జీవనం సాగించేందుకు ప్రభుత్వం ప్రతి కుటుంబానికి మత్స్యకర భరోసా అందిస్తుందని దానిని సకాలంలో ఇయ్యాలని మత్స్యకారులు కోరుకుంటున్నారు. వేటలేని కారణంగా సముద్ర తీరంలోని పడవలను ఒడ్డుకు చేర్చుకొని వలలు సురక్షిత ప్రాంతానికి చేర్చుకున్నారు.

విద్యుత్ షాక్‌తో నలుగురికి గాయాలు

- నిర్మాణంలో ఉన్న పెట్రోలు బంకు వద్ద నీటి గుంతలో తెగి పడిన కరెంటు తీగ
- తీగ తగలడంతో షాక్‌కు గురై గుంతలో పడిన వ్యక్తి
- రక్షించడానికి గుంతలో దిగి మరో ముగ్గురికి గాయాలు



వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ప్రజాశక్తి-టంగుటూరు

ఒంగోలు మండలంలోని వెంగముక్కపాలెం పరిధిలో ఒగూరు వెంకటేశ్వర్లుకి చెదిన పెట్రోలు బంకు నిర్మాణ దశలో ఉంది. ఆదివారం రాత్రి వీచిన పెనుగాలికి పెట్రోలు బంకు వద్ద ఉన్న విద్యుత్ తీగ ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో తెగి పడింది. విద్యుత్ తీగ తెగిన విషయం తెలియని ఒగూరి వెంకటేశ్వర్లు నీటి గుంత వద్ద ఉన్న తీగ తగిలి గుంటలో పడి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటేశ్వర్లు ఇంటి వద్దకు ఎంతకు రాకపోవడంతో ఆందోళనతో వారి కుమారుడు భరత్‌తో పాటు నలుగురు వెతుకుతూ పెట్రోలు బంకు వద్దకు వచ్చారు. చీకటిలో నీటిలో కొట్టు మిట్టాడుతున్న వెంకటేశ్వర్లుని గుర్తించిన యువకులు నీటి గుంతలోకి దూకారు. దీంతో వారిలో మరో ముగ్గురికి షాక్‌తో గాయాల పాలయ్యాయి. గుంతలో నుంచి బయటకు వచ్చి వైద్య చికిత్స కోసం ఒంగోలులోని సంఘమిత్ర వైద్యశాలలో చేరారు. ఒగూరు వెంకటేశ్వర్లుకి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్య చికిత్స కోసం చెన్నైకి అంబులెన్స్‌లో తరలించనున్నట్లు వెంకటేశ్వర్లు కుమారుడు భరత్ తెలిపారు.

స్పందించిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

వెంగముక్కపాలెంలో విద్యుత్ షాక్ ఘటనపై విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పందించి అధికారులను అప్రమత్తం చేశారు. బాధితులను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా యస్ఈ, సిఎమ్‌డిని ఆదేశించారు. వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులను విద్యుత్ శాఖ ఎస్ఇ కట్టా వెంకటేశ్వర్లు పరామర్శించారు.



తడిసిన పొగాకు పందిర్లు

అకాల వర్షం.. రైతులకు నష్టం

తడిసిన ధాన్యం రాశులు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

అల్పపీడన ప్రభావంతో ఆదివారం సాయంత్రం నుంచి పడిన పిడుగుల వాన భీభత్సం సృష్టించింది. దీంతో ప్రజలు, రైతాంగం తల్లడిల్లిపోయారు. ఈదురు గాలులతో కూడిన వర్షం పడటంతో మండలంలోని వివిధ గ్రామాల్లో చెట్లు విరిగి పడిపోయాయి. బ్యార్నిలపై రేకులు లేచిపోయాయి. గాలులకు విద్యుత్ తీగలు తెగి అర్ధరాత్రి వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. నాగులప్పలపాడు, ఉప్పుగుండూరు, కనపర్తి తదితర గ్రామాల ధాన్యం రాశులు, మిర్చి కల్లాలలతో పాటు పొగాకు పందిర్లపై పట్టలు గాలులకు లేచి పోవడంతో తడిసి ముద్దయ్యాయి. ఎన్నో ఒడిదుడకులు ఎదుర్కొని ఆరుగాలం పండించిన పంటలు అకాలవర్షానికి తడవడంతో రైతాంగం ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఏ పంట చూసినా దిగుబడులు బాగా తగ్గాయి. దాంతో ధరలు పతనం అవడంతో నష్టాలు తప్పలేదని రైతులు కంటనీరు పర్యంతమవుతున్నారు. పొగాకు రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. నల్లబర్లీ కొనేవాడు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెల్లబర్లి పందిర్లపై ఉండటంతో పాటు దిగుబడి కూడా 8 క్వింటాలకు మించిరాలేదు. రేటు చూస్తే గతఏడాది కన్నా తక్కువగా ఉండటంతో పాటు ఈ అకాలవర్షం మరింత దెబ్బతీసిందని, తద్వార పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాన్యం మిర్చి తడవడంతో రంగు మారుతుందని ఆందోళన చెందుతున్నారు. ఉప్పుగుండూరులో పోస్టాపీసు బజారులో వేపచెట్టు విరిగి పడడంతో ఆసమయంలో ఎవరు లేక పోవడంతో ప్రమాదం తప్పింది.



రోడ్డుపై నేలకూలిన చెట్టు

కారుమంచి కాలువ పనుల్లో కదలిక

ఎమ్మెల్యే బిఎన్, నల్లూరి వెంకట శేషయ్య చొరవ

బిడిఎంఎఫ్ నిధుల మంజూరు కోసం వినతి

ప్రజాశక్తి-చీమకుర్తి

కారు మంచి కాలువ పునర్నిర్మాణ పనుల్లో కదలిక మొదలైంది. గత మూడేళ్లుగా మధుకాన్ క్వారీలోకి జారిపోయిన కారుమంచి కాలువ కట్ట పునర్నిర్మాణ పనులు చేపట్టని పరిస్థితి తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కాలువ మరమ్మతులు పనుల వ్యవహారం తిరిగి తెరపైకి వచ్చింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు ప్రకారం కాలువ మరమ్మతు పనులు చేపడతామని నాయకులు తెలిపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నల్లూరి ఫౌండేషన్ అధినేత, ప్రవాస భారతీయుడు నల్లూరి వెంకట శేషయ్య చొరవ తీసుకొని కాలువ మరమ్మతు పనులపై దృష్టి సారించారు. ఇటీవల కారు మంచి కాలువపై దాదాపు రూ.25 లక్షలతో జంగిల్ క్లియరెన్స్ మరియు కాలువ పూడిక తీత పనులు ఆయన చేయించారు. అంతేగాక కారు మంచి కాలువ షట్టర్లు కూడా సొంత వీధులతోనే చేయించి బిగించారు. ఆయన చొరవ చూపడంతో కాలువలో పూర్తిస్థాయిలో కాకపోయినా రైతులకు తాగునీరు, సాగునీరు అందటానికి ఎంతగానో ఉపయోగపడింది. ఈ నేపథ్యంలో ఆయన సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్‌తో కలిసి కాలువపై పర్యటించి పునర్నిర్మాణ దిశగా అడుగులు వేశారు. కాలువ పరిధిలోని రైతులతో కె.వి పాలెంలో సమావేశం ఏర్పాటు చేసి చర్చించారు. ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్ మరియు నల్లూరి వెంకట శేషయ్య జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి కాలువ పునర్మాణ పనులకు రూ.2.60 కోట్లతో డిఎంఎఫ్ నిధులు కేటాయించాలని, వేసవికాలంలోనే మరమ్మతులు చేపట్టాలని విన్నవించారు. కారుమంచి కాలువ కింద 12 గ్రామాల ప్రజలకు, తాగునీరు, సాగునీరు అందుతుందని తెలిపారు. స్పందించిన జిల్లా కలెక్టర్ కాలువను తిరిగి పరిశీలించాలని సాగర్ ఎస్ఈ వరలక్ష్మిని పురమాయించారు. ఇటీవల సాగర్ ఎస్ఈ వరలక్ష్మి కారుమంచి కాలువపై అధికారులతో మరియు చీమకుర్తి వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ పాలడుగు వెంకట్ నారాయణలతో కలిసి కాలువను పరిశీలించారు. మధుకాన్ క్వారీలోకి దిగి కట్ట జారిపోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. తగు నివేదికను కలెక్టరుకు అందజేశారు. డిఎంఎఫ్ నిధులు మంజూరుపై కలెక్టర్ దృష్టి సారించడంతో, త్వరలో నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. నిధులు మంజూరు అయితే ఆన్‌లైన్ టెండర్లు పిలిచి కాలువ మరమ్మతులు వేసవి కాలంలోనే పూర్తిచేసే అవకాశం ఉంది. ఈ సందర్భంగా సాగర్ ఎస్ఈ వరలక్ష్మి మాట్లాడుతూ కారుమంచి కాలువ మరమ్మతు పనులు వేసవి ముగిసేలోపే పూర్తిచేస్తే, వచ్చే సీజనుకు రైతులకు మరియు తాగునీరుకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కాలువ పనులపై సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్ మరియు నల్లూరి వెంకట శేషయ్య చూపుతున్న చొరవను ఆమె అభినందించారు.



మధుకాన్ క్వారీలోకి జారిపోయిన కారుమంచి కాలువ కట్ట

శిద్దా హనుమంతరావు షష్టిపూర్తి వేడుకలు

ప్రజాశక్తి-చీమకుర్తి

కృష్ణ సాయి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత, ప్రముఖ పారిశ్రామిక వేత్త శిద్దా హనుమంతరావు, పుష్పలత దంపతుల షష్టిపూర్తి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఒంగోలు సంతపేటలోని షిరిడి సాయి ఆలయంలో షష్టిపూర్తి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం గణపతి పూజ, పుణ్యాహ వచనము, సాయంత్రం దీక్ష కంకణ ధారణ, అఖండ స్థాపన, మహా మండపారాధన, దీపారాధన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం పూర్ణాహుతి హెూమం, షష్టిపూర్తి హెూమం, యాగాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పలువురు శిద్దా హనుమంతరావు పుష్పలత దంపతులను వేద పండితులు, పలువురు ప్రముఖులు ఆశీర్వదించారు. కృష్ణ సాయి గ్రానైట్స్ అధినేత శిద్దా వెంకటేశ్వరరావు సూర్య కుమారి దంపతులు, శిద్దా భరత్ దంపతులు, యాపిల్ గ్రానైట్స్ అధినేత శిద్దా సూర్య ప్రకాష్ రావు జయశ్రీ దంపతులు, అర్చన రాజశేఖర్ దంపతులు, ఉదయ్ దంపతులు, నల్లూరి ఫౌండేషన్ అధినేత నల్లూరి వెంకట శేషయ్య, పారిశ్రామికవేత్తలు బంగారు రెడ్డి, వివా గ్రానైట్ అధినేత సి.నవీన్ కుమార్ రెడ్డి, కృష్ణ సాయి గ్రానైట్ డాకా రామచంద్రారెడ్డి, టీవీ మురళీమోహన్రావు, జడ్పిటిసి వేమశ్రీనివాసరావు, మాజీ జెడ్పిటిసి గోగినేని వెంకటేశ్వర్లు, సిద్ధ నాగేశ్వరరావు, వాసవి గ్రానైట్స్ అధినేత శిద్దా పాండురంగారావు, శిద్దా ఆంజనేయ ప్రసాద్, శిద్దా పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శిద్దా హనుమంతరావు దంపతులను ఆశీర్వదిస్తున్న ప్రముఖులు

పొదిలిలో భారీ చోరీ

30 సవర్ల బంగారం, వెండి వస్తువుల అపహరణ

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి పట్టణంలోని విశ్వనాథపురం ఆర్.డబ్లు.ఎస్ కార్యాలయం ఎదురు పట్టపగలు భారీ చోరీ జరిగింది. కుమార్తె వివాహం కోసం దాచుకున్న 30 సవర్ల బంగారం, వెండి వస్తువులు అపహరణకు గురయ్యాయి. సినీ ఫక్కీలో జరిగిన ఈ సంఘటన పట్టణంలో ఒక్కసారిగా సంచల నంగా మారింది. రోజువారి చేతి వృత్తి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న బీరం నాసర్ రెడ్డికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలను ఉన్నత చదు వు చదివించేందుకు ఎంతో కష్టపడిన ఆయన కుటుంబంలో భార్యాభర్తలు రోజువారి కూలీ పనులు చేసుకుంటున్నారు. పిల్లల ఉన్నత చదువుల కోసం బంగారాన్ని తాకట్టు పెట్టు కున్న వారు ఇటీవల కుమార్తెలకు ఉద్యోగాలు రావడంతో వాటిని విడిపించుకుంటూ వారి వివాహాలకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో బ్యాంకులో ఉన్న బంగారాన్ని విడిపించుకుని పెద్ద కుమార్తె వివాహం కోసం ఇంట్లో దాచి ఉంచారు. ఇటీవల పెళ్లి చూపుల కోసం గ్రామంలో బంగారాన్ని వాడుకుని ఇంట్లో పెట్టుకుంటూ ఉండగా సోమవారం ఉదయం భార్యాభర్తలిద్దరూ పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. మధ్యాహ్నం 12:30 సమయంలో భర్త నాసిరెడ్డి ఇంటికి రాగా అప్పటికే తలుపులు తెరిచి ఉండడానికి గమనించి భార్య వచ్చిందని అనుకుంటూ లోపలికి వెళ్లారు. బీరువా తాళం పగలగొట్టి ఓపెన్ చేసి ఉండడం గమనించి దొంగతనం జరిగినట్లు గుర్తించాడు. సమాచారం అందు కున్న పొదిలి సిఐ టి.వెంకటేశ్వర్లు, ఎస్ఐ వి.వేమనలు సంఘటన స్థలానికి చేరుకున్నారు. బీరువాను రాడ్‌తో పగలగొట్టి అందులో ఉన్న 30 సవర్ల బంగారు ఆభరణాలు, సుమారు రెండు కేజీల విలువైన వెండి వస్తువులను దొంగిలించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి, దొంగ తనం జరిగిన తీరును పరిశీలించిన సిఐ టి వెంకటేశ్వర్లు ఒంగోలు నుంచి క్లూస్ టీమ్ ను, జాగిలాన్ని రప్పించారు. బీరువా తాళాలు పగలగొట్టినా అక్కడ ఎటువంటి వేలిము ద్రలు లభించకపోవడంతో పోలీసులు నిరాశ చెందారు. అక్కడ దొరికిన ఒక చేతి రుమాలు ఆధారంగా వాసన చూస్తూ జాగిలం ప్రభుత్వ జూనియర్ కళాశాల గేటు వద్దకు వెళ్లి ఆగిపోయింది. పట్టపగలే భారీ దొంగతనం జరగ డంతో హడలిపోయిన పట్టణ ప్రజలు సీసీ కెమెరాలు బిగిం చినా చోరల జాడ దొరుకుతుందో లేదో అని అనుమాన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ఇటీవల పట్టణంలో నిఘా నేత్రాలు ఏర్పాటు చేసినప్పటికీ, వాటి కళ్ళు కప్పి వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. మూడు రోజుల క్రితం దర్శి రోడ్డులోని రామ్ నగర్‌లో జరిగిన దొంగతనాన్ని పట్టణ ప్రజలు మరు వక ముందే నేడు విశ్వనాథపురంలో పట్టపగలు దొంగలు హల్ చెల్ చేయడంతో దొంగతనానికి పాల్పడిన వారిని పట్టుకునేందుకు పోలీసులకు సవాల్‌గా మారింది.



ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ నరేంద్రవర్మ, ఆర్డీఓ

ఉచితంగా మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - బాపట్ల

ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఆర్గనైజేషన్ సభ్యులు రెయిన్‌బో సంస్థ అధినేత చంద్రశేఖర్ సహకారంతో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ, ఆర్డిఓ పి గ్లోరియా, తహశీల్దారు సలీమా ప్రారంభించారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ గౌరవ అధ్యక్షులు వేజండ్ల శ్రీనివాసరావు, కోశాధికారి జోగి సువర్ణరాజు, నల్లపాటి కిషోర్, విన్నకోట శ్రీనివాసరావు, పులిపాటి అమ్మయ్య, నరాలశెట్టి నాగరాజు, ఓటికుండల లక్ష్మణరావు, బేగ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చేనేత నాయకులు ఎం సత్యనారాయణ

చేనేతల సమస్యలపై 16న ధర్నా

ప్రజాశక్తి - భట్టిప్రోలు

రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలను కోరుతూ ఈనెల 16న స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద చేనేత కార్మికుల ధర్నా నిర్వహించనున్నట్లు ఎపి కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా భట్టిప్రోలులోని ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.5కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వర్క్ షెడ్లు నిర్మించుకున్న చేనేత కార్మికులకు రావాల్సిన రూ.60 వేలు బిల్లును వెంటనే విడుదల చేయాలని, చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు మార్గదర్శకాలు వెంటనే విడుదల చేయాలని కోరారు. చేనేత కార్మికులు ధర్నాకు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు దీపాల సత్యనారాయణ, కార్మిక సంఘ సీనియర్ నాయకులు ఆకురాతి శ్రీనివాసరావు, బట్టు నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.



దగ్ధమైన వరికుప్ప పరిశీలిస్తున్న వెంకట శివ నారాయణ

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

ప్రజాశక్తి - బాపట్ల

పిడుగు పాటుకు వరికుప్ప దగ్ధమై నష్టపోయిన రైతును అన్ని విధాల ఆదుకుంటామని జనసేన ఇన్‌ఛార్జి నామన వెంకట శివన్నారాయణ అన్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి మూలపాలెం శివారు పొలాల్లో వరికుప్పపై పిడుగు పడి దగ్ధమై నష్టపోయిన రైతు రేగులగడ్డ వినయ్ కుమార్‌ను ఆయన పరామర్శించారు. రైతు వినయ్ కుమార్‌కు తమ వంతు ఆర్థిక సహాయం అందజేశారు. నాయ కులు బెజ్జం బాబురావు, క్రీస్తు బాబు, తేజ, జనసేన లీగల్ సెల్ సభ్యురాలు జిడుగు విజయ మాధురి, ఆకిశెట్టి నాగమ ల్లేశ్వరి, ఊసా మాధవి, ఊసా ప్రసాద్, కొక్కిరాల రాజేంద్ర, నామన శ్యామ్, సతీష్, మోహన్ పాల్గొన్నారు.

'రాజ్యాంగం' దేశానికి దిక్సూచి : గొట్టిపాటి



అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్



బాపట్లలో అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న సిపిఎం గంగయ్య



అంబేద్కర్ జయంతి వేడుకల్లో తోకలవానిపాలెం సర్పంచి

ప్రజాశక్తి - అద్దంకి

దేశానికి దిశా నిర్దేశం చేసే గ్రంథం భారత రాజ్యాంగ మని, దానిని రూపొందించిన బాబా సాహెబ్ అంబేద్కర్ ప్రపంచ మేధావి అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా అంబే ద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ ఒక మతానికో, కులానికో చెందిన వ్యక్తి కాదని, ప్రపంచాన్ని ప్రభావితం చేసిన మేధావి, మహనీయుడని అన్నారు. బాల్యం నుండే కష్టాలు ఎదురైనా వెనకడుగు వేయకుండా పట్టుదలతో ముందుకు సాగిన యోధుడని అన్నారు. లండన్ యూనివర్సిటీలో ఎక్కువ కాలం గడిపి ఎక్కువ పుస్తకాలు చదివిన ఒకరిద్దరిలో అంబేద్కర్ ఒకరన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా రాబోయే అంబేద్కర్ జయంతి నాటికి అద్దంకిలో ఒక గ్రంథాలయం ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈరోజుల్లో టీవీ, సెల్ ఫోన్లతో కాలక్షేపం చేస్తున్నామని, పుస్తకాలతో కాలక్షేపం, అధ్యయనం చేయడం ద్వారా విజ్ఞాన వంతులు అవుతారని, పిల్లలను పఠనం వైపు మళ్లించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు శ్రీచరణ్, మునిసిపల్ కమిషనర్ రవీంద్ర, ఎంపీడీఓ నాయక్, సీఐ సుబ్బరాజు, రిటైర్డ్ అర్జెడి దేవపాలన, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, జాన్సన్, స్టాలిన్, పూనూరి నరేంద్ర పాల్గొన్నారు. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి స్థానిక బంగ్లారోడ్డులోని అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, ఆదాము, భీష్మ, నాగేశ్వరరావు, లాయర్ గంగాధరరావు, ప్రజాశక్తి విజయకుమార్, రత్నం పాల్గొన్నారు.

బాపట్ల : అంటరానితనం, కుల నిర్మూలన కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన రాజకీయవేత్త, సంఘ సంస్కర్త డాక్టర్ బిఆర్. అంబేద్కర్ చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగ య్య అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా రైల్వేస్టే షన్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం నాయకులతో కలిసి పూలమాల వేసిన నివాళులర్పించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జె వినయ్ కుమార్, సిపిఎం నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, వై భాస్కరరావు, కె నాగేశ్వరరావు, బోగిరెడ్డి , జాలాదివిజయరావు, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు. సమాజ వాది పార్టీ జిల్లా అధ్యక్షులు మేధా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య మాట్లాడారు. సమాజవాది పార్టీ జిల్లా అధ్యక్షుడు మేధ శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తన్నీరు సింగరకొండ, జెట్టి జోసెఫ్, దాసరి శ్యామ్ లివింగ్ స్టన్, సిపిఎం సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, భాస్కరరావు, నాగేశ్వరరావు, తిరుమలరెడ్డి, కె శరత్, కోట వెంకటేశ్వరరెడ్డి, కొండ్రు శరత్ కుమార్, మొర్ల చిన్న వెంకటేశ్వరరావు, విల్సన్, అబ్దుల్ కరీం, షాజహాన్, పాల్గొన్నారు.

పంగులూరు : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపిడిఓ కె స్వరూపరాణి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సమానత్వం కోసం రాజ్యాంగ నిర్మాతగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. దళిత కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి ఎంపిడిఓ పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు యర్రం శ్రీనివాసరెడ్డి, ఈఓఆర్డి సుమంత్, పిఆర్ ఎఇ జి హనుమంతరావు, ఎపిఓ కె సంతోషం, పంగుళూరు పంచాయతీ కార్యదర్శి బి రాంబాబు, తానికొండ రమేష్, కె వేణుమాధవ్, పుల్లారావు, కృష్ణ, టిడిపి నాయకులు గుడిపూడి రామారావు, కో ఆప్షన్ సభ్యులు కాసిం పాల్గొన్నారు.

యద్దనపూడి : మండలంలోని వింజనంపాడు, చింతపల్లిపాడు, అనంతవరం, యద్దనపూడి తహశీల్దారు కార్యాలయం తోపాటు సచివాలయాలులో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. చింతపల్లిపాడులో జరిగిన సభలో ప్రోహిబిబీషన్ అండ్ ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ బత్తుల అరుణారావు మాట్లాడుతూ అంబేద్కర్ దేశ ప్రజలందరి కోసం గొప్ప రాజ్యాంగాన్ని అందించారని అన్నారు. మహిళల హక్కుల కొరకు నిరంతరం కృషి చేశారని తెలిపారు. యనమదల, వింజనంపాడు గ్రామాల్లో సభలు నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దారు రవి కుమార్, యనమదల సర్పంచ్ రాయి పృథ్వీరాజ్, కార్యదర్శులు ఎ రాణి, జ్యోతి, ప్రసాద్, శ్రీను, శరత్, ప్రభాకర్, నాయకులు కొండమూడి బెనర్జీ, సమతా సైనిక్ దళ్ కన్వీనర్ రాజశేఖర్, శాంతారావు, జాన్ నెహ్రూ పాల్గొన్నారు.

మార్టూరు : ప్రజా సఘాల ఆధ్వర్యంలో స్థానిక సిఐటియు కార్యాలయంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మజుందర్, ఉపాధ్యక్షులు బి హనుమంతరావు, కె ప్రభుదాసు, పి రామాంజనేయులు, రాఘవరెడ్డి, కె రామకోటేశ్వరరావు, వై రాంబాబు, ఎస్‌కె గఫూర్, ఇబ్రహీం పాల్గొన్నారు.

పర్చూరు : డాక్టర్ బిఆర్. అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు పర్చూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో కూటమి నాయకులు అంబేద్కర్ చిత్రపటానికి పులమాల సమర్పించి ఘననివాళ్ళు అర్పించారు. స్థానిక బొమ్మల సెంటర్ సమీపంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, కోడూరు శేష బ్రహ్మాచారి, కె శివ, పి మీరావలి, శేషగిరి, అడపాల కృష్ణ, సతీష్ పాల్గొన్నారు. తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు పి బ్రహ్మయ్య అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. కార్యక్రమంలో విఆర్ఓ శ్రీనివాసరావు, విఆర్ఎ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

సంతమాగులూరు : తహశీల్దారు కె రవిబాబు ఆధ్వర్యంలో అధికారులు, రెవిన్యూ సిబ్బంది అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఎస్సీ కాలనీలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రెవిన్యూ అధికారులు, సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కొల్లూరు : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 134వ జయంతి మండలంలోని తోకలవానిపాలెం పంచాయతీలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి సర్పంచ్ టి కృష్ణమోహన్ పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అంబేద్కర్ జయంతి వేడుకల్లో సిపిఎం మండల కార్యదర్శి వేములపల్లి వెంకట రామయ్య, బొనిగల సుబ్బారావు పాల్గొన్నారు.

చిన్నగంజాం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు మండలలో ఘనంగా నిర్వహించారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు జె ప్రభాకరరావు అంబేద్కర్ చిత్రపటానికి పులమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డిటి సుజాత, విఆర్ఓలు, విఆర్ఏలు, సర్వేయర్స్ పాల్గొన్నారు.

భట్టిప్రోలు : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో అద్దేపల్లిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలోసిపిఎం నాయకులు జి నాగరాజు, వేము మోషే, సిపిఎం నాయకులు ఎం సత్యనారాయణ, పి మనోజ్, పప్పుల ఆరోను పాల్గొన్నారు.

నిజాంపట్నం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం యువజన అధ్యక్షుడు పచ్చపట్ల గంగరాజు, యువజన అధ్యక్షుడు గాలి రాజు, సాగు నీటి సంఘం డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ నక్కల పోలిరాజు, నర్రా సునీల్, నర్రా వెంకటేశ్వర్లు, కన్నెటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పంగులూరు : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలను ప్రజలంతా కొనసాగించాలని సిపిఎం సీనియర్ నాయకులు నాగబోయిన రంగారావు అన్నారు. మండలంలోని చిన్నమల్లవరంలో జరిగిన అంబేద్కర్ జయంతి సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రాయిని వినోద్ బాబు, గుడిపాటి మల్లారెడ్డి, కోటేశ్వరరావు, పి తిరుపతయ్య పాల్గొన్నారు.

రేపల్లె : సిపిఎం కార్యాలయంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మనిలాల్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు గాలి దానియేలు, వై కిషోర్, డి ధర్మరాజు, కె రమేష్, కె ఆశ్విరదాం, బి నాగరాజు, డి ఆగస్టిన్ పాల్గొన్నారు.

చీరాల : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర కమిటి సభ్యులు లింగం జయరాజు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు నలతోటి బాబురావు, పి కొండయ్య, ఎం వసంతరావు, డి నారపరెడ్డి, సుబ్బారావు, కె వెంకటేశ్వర్లు, వై ప్రసాద్ పాల్గొన్నారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బి బిక్షాలుబాబు, జిల్లా కార్యదర్శి పాలేటి సురేష్, పి సీతారామరాజు, వీరాంజనేయులు, గవిని నాగేశ్వరావు, సూరిబాబు, మల్లేశ్వరరావు, శ్రీమాన్, శ్రీనివాసులు, కుర్రా శ్రీనివాసరావు, డేవిడ్, శ్రీరాం శ్రీనివాసరావు, పిచ్చియ్య, రాజేష్, వెలిగొండారెడ్డి పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి వైసీపీ ఇంచార్జి కరణం వెంకటేష్ నివాళులర్పించారు. ఆయన వెంట మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బోనిగల జైసన్ బాబు పాల్గొన్నారు. తన అనుచరులతో కలిసి మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి విడిగా నివాళి అర్పించారు.



పంగులూరులో మాట్లాడుతున్న నాగబోయిన రంగారావు



యద్దనపూడిలో మాట్లాడుతున్న బత్తుల అరుణారావు



రేపల్లెలో అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు



బహుమతులు అందజేస్తున్న సిఐ శ్రీనివాసరావు, మండవ మురళీకృష్ణ

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో ఒంగోలు సంతపేటలోని డిఆర్ ఎం ఎం మున్సిపల్ హై స్కూల్లో గత మూడు రోజులుగా జరిగిన పోటీలలో విజేతలకు సోమవారం నాడు బహుమతులు అందజేశారు. జై భీమ్ ఫౌండేషన్ సెక్రెటరీ చిక్కాల కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఒంగోలు టుటౌన్ సిఐ మేడా శ్రీనివాసరావు మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని కోరారు. సూర్యశ్రీ వికలాంగుల చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు చేశారు. కార్యక్రమంలో మానవత సేవా సంస్థ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు, ఎంఈఓ నాగేంద్ర వదన్, అసిస్ట్ డిప్యూటీ డైరెక్టర్ వడ్డెంపూడి సుజాత రావు, సినీ నటులు, బిసి సమైక్య సమితి రాష్ట్ర అధ్యక్షులు దన్నారపు మస్తాన్‌రావు, ఏజే సొల్యూషన్ డైరెక్టర్ ప్రియా, పఠ్రి వెంకట్రావు, వై.మల్లికార్జునరావు, పిఈటి టీచర్ అశోక్, జనార్ధన్ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అగ్నిమాపక శాఖాధికారులు

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులోని అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి వి.శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ఈ వారోత్సవాలు ఈ నెల 20 వరకు జరుగుతాయన్నారు. 'అగ్ని సురక్షిత భారతదేశం కోసం ఐక్యమవ్వండి' నినాదంతో ఈ వారోత్సవాలు జరుగుతున్నట్లు తెలిపారు. అగ్ని ప్రమాద సమయాల్లో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించేందు స్టాల్‌ను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాద నివారణ చర్యలకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ నామినేని కిరణ్

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరం, లంబాడీ డొంకలో మంచినీటి చలివేంద్రాన్ని జిజిహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పూలే, అంబేద్కర్ ఆశయ సాధన సమితి ప్రతినిధులు బత్తుల శ్రీనివాస్, ఆర్. శ్రీనివాస్, కోలా వెంకటరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డి3 పరిధిలో మంగళవారం ఊరచెరువు, సమైక్యతా నగర్, కొత్త కూరగాయల మార్కెట్, ఆర్‌టిసి బస్టాండ్ తదితర ప్రాంతాలలో ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ డిఈఈ కెవి.పాండురంగారావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

డి1 పరిధిలో..

డి1 పరిధిలో మంగళవారం ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు నిర్మల్ నగర్ ఫీడర్‌లో, లైన్ కు అడ్డంగా ఉన్న చెట్టుకొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో చెన్నుపాటి కాంప్లెక్స్, ఐశ్వర్య నగర్ పార్క్, అయ్యప్ప స్వామి టెంపుల్, అయ్యప్ప స్వామి టెంపుల్ వెనుక వైపు, సెవెన్ బిల్డింగ్స్, ఖద్దర్ ఆఫీసు రోడ్డు, స్వాతి రెసిడెన్సి, ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు ఒంగోలు టౌన్ డిఈఈ కెవి.పాండురంగారావు పేర్కొన్నారు.

మున్సిపల్ కార్మికులను

రెగ్యులర్ చేయాలని వినతి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఒంగోలు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. సోమవారం నాడు అంబేద్కర్ జయంతి సందర్భంగా కార్మికులు నెల్లూరు బస్టాండ్ నుంచి ప్రదర్శనగా కలెక్టరేట్ వద్ద వున్న విగ్రహానికి పూల మాలలు వేసి, తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినూత్నంగా అంబేద్కర్‌కు వినతిపత్రం అందించారు. 1,3,4 డివిజన్ల పరిధిలోని కార్మికులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు ఒంగోలు నగర కార్యదర్శి టి.మహేష్, యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నిపాటి శ్రీనివాసరావు, యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు జి నరసింహ, టి విజయమ్మ నాయకులు వై రవి, బి ఇశ్రాయేలు, బి సుబ్బారావు, కె వెంకటేశ్వర్లు, బి రవి, కె యాకోబు, భారతికుమారి, ఎం బాబు, ఆర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు, నాయకులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నియోజకవర్గంలోని కొత్తపట్నం మండలం కె.పల్లెపాలెం చోళా రిసార్ట్‌లో 2001 అల్లూరివీడు హైస్కూలు లో పదోతరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ కలయిక ఉత్సాహంగా సాగింది. 25 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులు ఒక చోట ఏకం కావడంతో వారి మధ్య ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఒకరుకొకరు అలనాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ఆనంద సాగరంలో మునిగితేలారు. ఆత్మీయంగా మాట్లాడుకున్నారు.



పూర్వ విద్యార్థుల సందడి

కేంద్ర హోం మంత్రిని కలిసిన మాగుంట

పశ్చిమ ప్రకాశానికి నిధులు కేటాయించాలని వినతి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసిన ఎంపి మాగుంట పలు అంశాలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట మాట్లాడుతూ ఒంగోలు మండలం గుండాయపాలెంలోని బకింగ్ హామ్ కెనాల్ పై 17 కోట్ల రూపాయలతో రోడ్డు, బ్రిడ్జి నిర్మించాలని కోరారు. ప్రకాశం జిల్లా వెనుకబడిన జిల్లా అని, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గం లో పశ్చిమ ప్రాంతం బాగా వెనుకబడి ఉందని, ప్రత్యేక దృష్టి సారించి నిధులు కేటాయించాలని ఎంపి మాగుంట కోరారు.

పౌష్టికాహారం విషయంలో రాజీపడొద్దు..

డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

ప్రజాశక్తి-దర్శి

బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారం అందించడం లో రాజీ పడవద్దని టిడిపి దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. దర్శిలో సోమవారం నలుగురు అంగన్వాడీ టీచర్ పోస్టులకు, 16 ఆయా పోస్టులకు నియామక పత్రాలను అందజేశారు. ఆమె మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని కోరారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని ఆమె స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నియామక పత్రాలు అందుకున్న టీచర్లను డాక్టర్ లక్ష్మీ అభినందించారు. కార్యక్రమంలో దర్శి సిడిపిఒ సిహెచ్.భారతి, సూపర్ వైజర్స్ అనురాధ, జ్యోతి పాల్గొన్నారు.

అంబేద్కర్ స్ఫూర్తితో అన్ని వర్గాల అభివృద్ధి

- సమ సమాజ స్థాపనకు రాజ్యాంగ నిర్మాత కృషి
- ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే దామచర్ల, కలెక్టర్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సమ సమాజ స్థాపన కోసం అవిశ్రాంతంగా పోరాడిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన రావు తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం ఒంగోలులోని అంబేద్కర్ భవన్ లో జరిగిన వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత హెచ్‌సిఎం సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి, కలెక్టరేట్ సెంటర్‌లోని అంబేద్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలకు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయ్ కుమార్, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాతలతో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి పుష్పాంజలి ఘటించారు. హెచ్‌సిఎం సెంటర్‌లో కేకును కోసి పంపిణీ చేశారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ బి. చిన ఓబులేసు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, ఎస్‌సి కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, దళిత, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఒంగోలులో నివాళులర్పిస్తున్న కెవిపిఎస్ నాయకులు



ఒంగోలులో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, మేయర్, ఎమ్మెల్యేలు

రాజ్యాంగ హక్కుల రక్షణకు ఉద్యమిద్దాం..

ఒంగోలు సిటీ : పాలకులు అవలంబిస్తున్న మనువాద – మతోన్మాద విధానాల వల్ల రాజ్యాంగం కల్పించిన హక్కులు హరించి వేయబడుతున్నాయని, రాజ్యాంగ పరిరక్షణే అంబేద్కర్‌కు అందించే నిజమైన నివాళి అని పలువురు అభిప్రాయపడ్డారు. రాజ్యాంగ హక్కుల రక్షణకు ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎల్‌బిజి భవన్‌లో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు అట్లూరి రాఘవులు పూలమాల వేసి.. నివాళులర్పించారు. అనంతరం ఎల్బీజీ భవన్ నుండి ఒంగోలు కలెక్టరేట్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్దకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి కెవిపియస్ జిల్లా ఉపాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి రఘురామ్ పూల మాలలు వేసి.. నివాళులర్పించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు జివి.కొండారెడ్డి, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు జి శేషయ్య, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య, డివైయఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్ బాబు, ఐద్వా జిల్లా కార్యదర్శి కే.రమాదేవి, జనవిజ్ఞానవేదిక జిల్లా కార్యదర్శి జయప్రకాష్, కెవిపిఎస్ నాయకులు నారాయణ, సిఐటియు ఒంగోలు నగర కార్యదర్శి టి మహేష్, పట్టణ పౌరసంఘాల సమైక్య నాయకులు జి.రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి సిహెచ్.వినోద్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరాస్వామి సిఐటియు నాయకులు బివి రావు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ విజ్ఞానకేంద్రంలో..

నగర పరిధిలో గాంధీనగర్ భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రంలో అంబేద్కర్ చిత్రపటానికి సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ నగర కార్యదర్శి రావూరి శ్రీనివాసరావు, భగత్ సింగ్ విజ్ఞానకేంద్రం నిర్వాహకులు ఎస్ కె పీర్, నగర నాయకులు బివిరావు, నాయకులు దాస్, రామయ్య, గురవయ్య పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా కార్యాలయంలో..


అంబేద్కర్ స్ఫూర్తితో సామాజిక మార్పు కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని పలువురు నాయకులు పేర్కొన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా సోమవారం నాడు స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం లో ఆ పార్టీ నేతలు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, దర్శి శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసిపి ఒంగోలు నియోజకవర్గ ఇంఛార్జి చుండూరు రవిబాబు, రాష్ట్ర ప్రచార విభాగం అధ్యక్షులు కాకుమాను రాజశేఖర్, రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షులు కుప్పం ప్రసాద్, మాజీ ప్రభుత్వ సలహాదారులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, కటారి శంకర్ నివాళులర్పించారు.

ఆర్‌టిసిలో..

ఒంగోలులోని ఆర్టీసీ బస్టాండ్‌లో జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయం వారి ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఒంగోలు డిపో మేనేజర్ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు.

ప్రగతి భవన్‌లో..

ఒంగోలులోని ప్రగతి భవన్‌లో అంబేద్కర్ చిత్రపటానికి డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.నారాయణ పూలమాల వేసి.. నివాళులర్పించారు.



వైసిపి కార్యాలయంలో నివాళులర్పిస్తున్న బూచేపల్లి



సామాజిక ఆరోగ్య కేంద్రం

పేరుకే 50 పడకల వైద్యశాల

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలోని 50 పడకల ప్రభుత్వ వైద్యశాల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. అది పేరుకే 50 పడకలు, వైద్యులు లేరు, సౌకర్యాలు లేవు. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజూ సగటున 300 మంది రోగులు చికిత్సల కోసం వస్తున్నా తగినంత వైద్య సిబ్బంది లేక ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి వైద్యశాలలో 14 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా కేవలం ఆరుగురు మాత్రమే ఉన్నారు. వీరిలో ముగ్గురు వారంలో మూడు రోజులు పాటు ఇతర ప్రాంతంలో చికిత్సలు చేసేందుకు వెళుతున్నారు. మిగిలిన ముగ్గురుతోనే వైద్యశాల నడుస్తోంది. ఫలితంగా రోగులకు మెరుగైన చికిత్సలు అందించడానికి కావాల్సిన వైద్యులు లేకపోవడంతో తిప్పలు తప్పడం లేదు.

ఘాట్ రోడ్డు కావడంతో..

కర్నూలు-శ్రీశైలం ఘాట్ రోడ్డు కావడంతో ఈ ప్రాంతంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతుంటాయి. అయితే ప్రమాదాలు జరిగిన సమయంలో వారికి చికిత్సలు అందించేందుకు సరిపోయినంత మంది వైద్యులు లేకపోవడంతో అవస్థలు పడాల్సి వస్తోంది. దీనికి తోడు ఈ ప్రాంతంలో ఎక్కువగా చెంచు గిరిజనులు, దళితులే ఉండడంతో వారంతా చికిత్సల కోసం వస్తుంటారు. అయితే వారికి సైతం మెరుగైన చికిత్సలు అందక గత్యంతరం లేక ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కనీసం రక్తపరీక్షలు నిర్వహించేందుకు ల్యాబ్ టెక్నిషియన్లు కూడా లేరు. ఎక్స్‌రే ప్లాంట్ మంజూరైనప్పటికీ పరికరాలు బిగించలేదు. దీంతో ఏ చిన్న ఎక్స్‌రే అవసరమున్నా పేదలు బయటకు వెళ్లి డబ్బులిచ్చి ప్రైవేటుగా ఎక్స్‌రే తీయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ఇన్ పేషంట్‌లకు తప్పని తిప్పలు..

ప్రతిరోజూ వైద్యశాలలో 30 నుంచి 40 మంది దాకా ఇన్ పేషంట్లుగా చేరుతున్నారు. అయితే వారికి మెరుగైన చికిత్సలు ఉన్న ముగ్గురు వైద్యులే అందించాల్సిన పరిస్థితి దాపురించింది. ముఖ్యంగా ఎముకలు, గైనిక్, చిన్న పిల్లలు, జనరల్ తదితర విభాగాల వైద్య నిపుణులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై గత ఏడాది సెప్టెంబర్ 11వ తేదిన జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా వచ్చిన సందర్భంలో ఆసుపత్రికి వైద్యులను నియమించడంతో పాటు సౌకర్యాలు కల్పించాలని వైద్య సిబ్బంది కోరితే వెంటనే సమస్యను పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారే తప్పా ఆచరణలో అమలు కాలేదని రోగులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకొని పెద్దదోర్నాల వైద్యశాలకు అవసరమైన వైద్యులను నియమించడంతో పాటు ఎక్స్‌రే ప్లాంట్‌ను అందుబాటులోకి తెచ్చి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా
డాక్టర్ వైద్య సంజీవ్, ఇంచార్జి సూపరింటిండెంట్

పెద్దదోర్నాలలోని 50 పడకల వైద్యశాలకు కావాల్సిన వైద్యుల వివరాలతో పాటు ఏఏ సౌకర్యాలు కావాలో నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు పంపాము. ప్రస్తుతం ఉన్న వైద్యులతోనే రోగులకు మెరుగైన చికిత్సలు అందిస్తున్నాం. అన్ని విభాగాల వైద్యులను నియమిస్తే మరింత వైద్య సేవలు అందించగలుగుతాము.


వైద్యశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ (ఫైల్)

ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నాం

భీమవరంలో ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణలో మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి - ఇంకొల్లు

జగన్ మోహన్ రెడ్డి విధ్వంసక పాలనతోనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నదని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని భీమవరంలో ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకనప్పటికీ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధి వైపు అడుగులు వేస్తూ సంక్షేమాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు రూ.4వేలకు పెంచి ప్రతినెలా 1న ఇంటి వద్దనే అందిస్తున్నామని అన్నారు. భూముల రీ సర్వే కొనసాగిస్తున్నామని తెలిపారు. పేదల ఆకలి తీర్చేందుకు 200 అన్నా క్యాంటీన్లు ప్రారంభించామని అన్నారు. త్వరలోనే తల్లికి వందనం, ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ పూర్తి, రైతు భరోసా నిధులు ఇవ్వనున్నట్లు తెలిపారు. డాక్టర్ అంబేద్కర్ ఆశయాలతో అన్న ఎన్టీఆర్ టిడిపిని స్థాపించిన నాటి నుండి ఇప్పటివరకు పనిస్తుందని అన్నారు. అంబేద్కర్ జయంతి రోజే తెలుగోడి ఆత్మగౌరవం కోసం టిడిపిని స్థాపించిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ప్రారంభించటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎపి మారిటోరియం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో తెలుగుజాతి ఆత్మగౌరవం కోసం ఎన్టీఆర్ కృషి చేశారని అన్నారు. పేదలకు రేషన్ బియ్యం ఇచ్చిన ఘనత ఎన్‌టిఆర్‌దేనని అన్నారు. మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరిటయ్య, శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి పాలనతో విసుగు చెందిన ప్రజలు ఆ పార్టీని 11 సీట్లకే పరిమితం చేసి బుద్ధి చెప్పారని అన్నారు. విద్యుత్ శాఖ ఆర్థిక ఇబ్బందుల్లో కురుకపోయినప్పటికీ సమర్థవంతంగా నిర్వహిస్తారనే సోదరుడు గొట్టిపాటి రవికుమార్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి పదవి బాధ్యతలు చెప్పారని అన్నారు. భీమవరంతో పాటు పర్చూరు నియోజకవర్గం సముద్రతీర ప్రాంతానికి దగ్గరగా ఉండటం వల్ల 60ఏళ్ల క్రితం నాటిన విద్యుత్ స్తంభాలు, వైర్లు దెబ్బతిని పోతున్నాయని అన్నారు. హైవే నుంచి చందలూరు, ఇంకొల్లు మీదుగా వేటపాలెం, మోటుపల్లి వద్దకు డబల్ రోడ్డు ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత అభివృద్ధికి దోవచపడుతుందని అన్నారు. కార్యక్రమంలో బాపట్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ సలగల రాజశేఖర్, కారంచేడు, ఇంకొల్లు మండలాల టిడిపి అధ్యక్షులు తిరుమలశెట్టి శ్రీహరి నాయుడు, హనుమంతరావు, గుంజి వెంకట్రావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

ఆధునీకరించిన క్రీడా ప్రాంగణం ప్రారంభం


క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక తమ్మన మల్లికార్జునరావు ఉన్నత పాఠశాలలో ఆధునీకరించిన క్రీడా ప్రాంగణం సోమవారం ప్రారంభించారు. క్రీడా సామాగ్రి పంపిణీ, అభినందన సభ నిర్వహించారు. దాతలు బట్టు నాంచారయ్య, పద్మ పాఠశాల ప్రాంగణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. తమ్మన మల్లికార్జునరావు విగ్రహానికి గొట్టుముక్కల గోపాలరావు, రమాదేవి పూల మాలలు వేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. క్రీడా పతాకాన్ని ప్రగడ శ్రీహరి, సిద్ధార్థ ఆవిష్కరించారు. పాఠశాల కరస్పాండెంట్ పులికొండ మల్లికార్జునరావు అధ్యక్షతన హెచ్‌ఎం చందలూరి రామకోటేశ్వరరావు పర్యవేక్షణలో వాకింగ్ ట్రాక్‌ను బట్టు చంద్రశేఖర్, అరుణ ప్రారంభించారు. వాలీబాల్ కోర్టును నాంచారయ్య, గోపాలరావు, సాఫ్ట్ బాల్ కోర్టు చంద్రశేఖర, అరుణ బ్యాడ్మింటన్ కోర్టు ప్రగడ శ్రీహరి సిద్ధార్థ, ఉష ప్రారంభించారు. 100, 200 మీటర్లు పరుగు పందెంలో విజేతలకు, వాలీబాల్ విన్నర్స్‌కు బహుమతులు అందజేశారు. పాఠశాల క్రీడా ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంలో సహకరించిన కరస్పాండెంట్, హెడ్మాస్టర్ చేబ్రోలు శ్రీనివాసరావు, మహమ్మద్ హక్, గార్యాల వెంకటేశ్వర్లును దాత బట్టు నాంచారయ్య కొనియాడారు. పాఠశాల పాలకవర్గం తరపున కరస్పాండెంట్ పులికొండ మల్లికార్జునరావు, ప్రెసిడెంట్ పులికొండ సితారత్నం, పాఠశాల తరపున హెడ్మాస్టర్ చందలూరి రామ కోటేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, బెల్లంకొండ శ్రీనివాసరావు దాతలు బట్టు నాంచారయ్య, పద్మ, గొట్టుముక్కల గోపాలరావు, రమాదేవి, బట్టు చంద్రశేఖర్, అరుణ, ప్రగడ శ్రీహరి సిద్ధార్థ, ఉష మొమెంటోలు, శాలువా, పుష్పమాలతో పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ షేక్ కరిముల్లా, తిరుపతిరావు, మాచర్ల వెంకటేశ్వరరావు, అల్లాభక్షు, కొణతం తేజ, కరీంశెట్టి సుబ్బారావు, శ్రీనివాసరెడ్డి, వంగర శేషగిరిరావు, రామనాథ రామకృష్ణ, బిఎస్ఆర్, కుందేటి రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.


ప్రారంభించబడిన నూతన క్రీడా ప్రాంగణం

ఉసూరుమన్న 'ఉరుసు' ఉత్సవాలు...!

- సాంస్కృతిక కార్యక్రమాలకు అనుమతి ఇవ్వని పోలీసులు
- టిడిపిలోని గ్రూపు వివాదాలే కారణమని ఆరోపణలు

ప్రజాశక్తి-పెద్దారవీడు

పెద్దారవీడులోని శ్రీనాగు లమీరా స్వామి ఉరుసు ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక గుర్తింపు ఉంది. ఓ విధంగా చెప్పాలంటే మత సామరస్యానికి ప్రతీకగా ఈ ఉరుసు వేడుక నిలుస్తుంది. ఆ గ్రామంలో అన్ని కులాలు, మతాలకు చెందిన వారు ఉన్నా పెద్ద పండుగ అంటే శ్రీనాగులమీరా స్వామి' ఉరుసు ఒక్కటే. శనివారం నుండి ఉరుసు ఉత్సవాలు గంధోత్సవంతో మొదలయ్యాయి. ఆదివారం జెండాలు, సోమవారం కందూరు ఉత్సవంతో ముగిసింది. జెండాల పండుగ రోజున సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. గ్రామంలో రాజకీయ పార్టీల పరంగా పోటా పోటీగా కార్యక్రమాలు చేపట్టినా అందరూ కలిసికట్టుగా సహకారం అందించుకుంటారు. ఈ ఏడాది కూడా ఎప్పటి మాదిరిగా ఉరుసు ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమాల నిర్వాహకులు పోలీస్ శాఖ అనుమతి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. పదేపదే పోలీస్ స్టేషన్‌ల చుట్టూ తిరిగారు. పోలీసులు మాత్రం అనుమతి లేదని తేల్చి చెప్పారు. ఎన్నడూ లేని విధంగా అనుమతి లేకపోవడం ఏమిటని ప్రజల్లో చర్చ మొదలైంది. అధికార తెలుగుదేశం పార్టీలో రెండు గ్రూపుల కారణంగానే సాంస్కృతిక కార్యక్రమాలు నిలిచిపోయినట్లు తెలుస్తోంది. యర్రగొండపాలెం టిడిపి ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు వైపు ఉండగా మరో వర్గం డాక్టర్ మన్నె రవీంద్ర వైపు వెళ్లింది. ఈ దఫా డాక్టర్ మన్నె రవీంద్ర సహకారంతో పెద్దారవీడు ఉరుసు సందర్భంగా పాట కచేరీ ఏర్పాటు చేయాలనుకున్నారు. డాక్టర్ రవీంద్ర ఆధ్వర్యంలో పాట కచేరీ జరగరాదని టిడిపి ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న ఎరిక్షన్‌బాబు అభ్యంతరం వల్లనే పోలీసులు అనుమతి నిరాకరించారనే ప్రచారం ఉంది. టిడిపిలో ఆధిపత్య పోరు తమ గ్రామంలో జరిగే ఉరుసు వేడుకలపై చూపడంపై గ్రామస్తులు మండిపడు తున్నారు. మంచి పనులు చేయాలే గానీ ఇలా అందరి మనసు గాయపరిచేలా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.


శ్రీనాగులమీరా స్వామి దర్గా


విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

అంబేద్కర్ విగ్రహానికి భూమి పూజ

ప్రజాశక్తి - నాగులుప్పలపాడు

మండలంలో వివిధ గ్రామాల్లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. తక్కెళ్ళపాడులో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ నిర్వహించారు. ఉప్పుగుండూరు యూత్ ఆద్వర్యంలో గ్రందాలయం సెంటరు వరకు ర్యాలీ నిర్వహించారు. చీర్వానుప్పలపాడులో సర్పంచ్ మేడికొండ చెన్నమ్మ ఆద్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమాల్లో బేద్కర్ యూత్ సభ్యులు, ఎంపిటిసి పొద పవన్, మేడికొండ మురళీ, జాగర్ల మూడి హరిబాబు, కార్యదర్శి శ్రీదేవి, పద్మావతి, ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు జ్యోతి రమేష్ బాబు, సర్పంచ్ చినబాబు, శ్రీమన్నారాయణ, జగన్నాధం, యోహను, బుజ్జిబాబు, చంటి, రిటైర్డ్ ఎక్స్ సైజ్ ఎస్ఐ ఆంజనేయులు పాల్గొన్నారు.

బ్లాక్ బర్లీ పొగాకు మద్దతు ధరకు కొనాలి

• రైతు, కౌలు రైతు సంఘాల డిమాండ్ • నేడు పర్చూరులో నిరసన

ప్రజాశక్తి - పర్చూరు

బ్లాక్ బర్లీ పొగాకు వెంటనే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 15న స్థానిక బొమ్మలు సెంటర్లో నిరసన తెలియజేస్తున్నట్లు రైతు సంఘం నాయకులు తెలిపారు. స్థానిక వైఎస్ఆర్ విగ్రహం వద్ద జరిగిన పొగాకు రైతుల సమావేశంలో రైతు సంఘం నాయకులు సిహెచ్ గంగయ్య రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం, వ్యాపారులు కలిసి నాటకం ఆడుతున్నారని ఆరోపించారు. వారం రోజుల్లో కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చి 15 రోజులైనా పట్టించుకున్న నాధుడే లేడని అన్నారు. రోజుల గడిస్తే గత్యంతరం లేక రైతులు అయిన కాడికి అమ్ము కొంటారని వ్యాపారస్తులు కాలయాపన చేస్తున్నారని అన్నారు. గతేడాది రేటు ఇచ్చి నమ్మించి వేల ఎకరాల్లో సాగు చేయించి ఇప్పుడు కొనకుండా మొరాయిస్తున్నారని అన్నారు. అందువల్ల



రైతులతో మాట్లాడుతున్న సిహెచ్ గంగయ్య

పొగాకు రైతులు అందరూ ఐక్యంగా కదరాలని కోరారు. పర్చూరు బొమ్మల సెంటర్లో జరిగే నిరసన కార్యక్రమానికి పొగాకు రైతులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో బండారు చినదాసు, పి కొండయ్య, డేవిడ్ పాల్గొన్నారు.

'తవనం సేవాసమితి' ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - మేదరమెట్ల

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా మాజీ ఎంఎల్ఎ, సిపిఎం నేత తవనం చెంచయ్య సేవాసమితి, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఒంగోలు ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రాసంగులపాడులో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 150 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఉపాస్ హాస్పిటల్ వైద్యులు, జాయింట్ రీ ప్లేస్మెంట్, కీ హోల్ సర్జరీస్ నిపుణులు డాక్టర్ ప్రకాష్ చావల, డైయాబెటిక్, ఇన్ఫెక్షియస్, సాధారణ వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ మహేష్ వేమవరపు, ఫిజియోథెరఫీ ఇంఛార్జ్ డాక్టర్ జగదీశ్, వైద్య బృందం పరీక్షలు చేశారు.



వైద్య శిబిరం ప్రారంభిస్తున్న దృశ్యం

తొలుత డాక్టర్ బిఆర్ అంబేద్కర్కు నివాళి అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బ్రహ్మయ్య, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు సావా శ్రీనివాసరావు, తవనం రవి, శ్రీకాంత్, కిరణ్, ఆర్ఎంపి కరవాది హరిబాబు, ఉపాస్ హాస్పిటల్ పిఆర్ఓ రాము పాల్గొన్నారు.

మహిళలకు రూ.4.40 కోట్ల రుణాలు మంజూరు

ప్రజాశక్తి - చీరాల

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషిచేసి అందరికీ సమాన హక్కులు కల్పించే విధంగా భారత రాజ్యాంగాన్ని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అందించారని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. అంబేద్కర్ విగ్రహానికి టిడిపి అధికార ప్రతినిధి ఎం మహేంద్రనాథ్, గౌరీ అమర్నాథ్, టిడిపి నాయకులతో కలిసి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. మహిళలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో 3వేల మంది మహిళలకు కుట్టు మిషన్లు అందిస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎస్సీ, ఎస్టీలకు రుణాలు అందిస్తున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు 138 మందికి మెప్మా ఆధ్వర్యంలో రూ. 4.40 కోట్ల రుణాలు అందజేశారు.



అంబేద్కర్కు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

కార్యక్రమంలో కమిషనర్ అబ్దుల్ రషీద్, డిఈ రఘురాం, ఎంఎంసి చైర్మన్ కౌతరపు జనార్ధనరావు, మెప్మా సిఎంఎం దొక్క కొండయ్య, అధికారులు, కౌన్సిలర్లు, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

వేట నిషేధ కాలాన్ని తప్పక పాటించాలి

ప్రజాశక్తి - రేపల్లె

చేపల వేట నిషేధ కాలాన్ని మత్స్యకారులు కచ్చితంగా పాటించాలని సాగర్ మిత్ర బి నాగరాజు, విఎఫ్ఎ వీరాంజనేయులు సూచించారు. భారత ప్రభుత్వ ఉత్తర్వుల అనుసరించి తూర్పుతీర ప్రాంతంలో అనగా బంగాళా ఖాతం సముద్రంలో ఏప్రిల్15 నుండి జూన్14 వరకు 61 రోజుల పాటు సముద్రంలో వేట నిషేదం అమలులో ఉంటుందని తెలిపారు. ఈ 61 రోజులు మర పడవల ద్వారా వేట నిషేధమని అన్నారు. సముద్ర జలాల్లో చేపల వేట నిషేదం ఉద్దేశం, వివిధ చేప, రొయ్య, పీత జాతుల సంతానోత్పత్తి కాలంలో తల్లి చేప, రొయ్య, పీతలను సంరక్షించడం, వాటి సంతతి పెరుగుదలను ప్రోత్సహించడం తద్వారా సముద్ర మత్స్య సంపద సుస్థిరత సాధించవచ్చని అన్నారు. సముద్ర జలాల్లో మేకనైజిడ్, మోటరైజ్డ్ బోట్లపై ఎటువంటి చేపలవేట చేయకుండా మత్స్య అభివృద్ధికి సహకరించాలని కోరారు.



మాట్లాడుతున్న సాగర్ మిత్ర బి నాగరాజు

చీరాల : వేట విరామ సమయంలో మత్స్య కారులు వేట చేయవద్దని మత్స్య శాఖ అధికారులు మత్స్యకారులకు సూచించారు. వాడరేవు, రామాపురం సముద్ర తీర గ్రామాల్లో మత్స్యకారులకు అవగాహన కల్పించారు. వేట విరామం నేటి నుండి జూన్ 14వరకు కొనసాగుతుందని తెలిపారు. మరబోట్లతో వేట చేస్తే చర్యలు తీసుకుంటామని సూచించారు.



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్ని ప్రమాదాల పట్ల జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - బాపట్ల

అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని విపత్తు స్పందన అగ్నిమాపక జిల్లా అధికారి సి మాధవ నాయుడు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఈనెల 14 నుండి 20 వరకు జరిగే అగ్ని ప్రమాదాల నివారణకు తక్షణమే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు ప్రారంభించారు. విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయి అమరులైన అగ్నిమాపక సిబ్బందికి నివాళులర్పించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రచార గోడ ప్రతులను ఆవిష్కరించారు. అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు సూచనలు చేశారు. బాపట్ల అగ్నిమాపక అధికారి వై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



వారోత్సవాలు ప్రారంభిస్తున్న డాక్టర్ రంగారావు

అద్దంకి : పట్టణంలోని ఎఎంసి యార్డు సమీపంలోనే ఫైర్ స్టేషన్ అధికారి జి వెంకట్రావు ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజా వైద్యులు డాక్టర్ కోగంటి రంగారావు అగ్నిమాపక పరికరాల పరిశీలన ప్రజలకు అవగాహన ప్రారంభించారు. అగ్ని ప్రమాదం జరిగితే కొద్ది క్షణాల్లోనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చి నష్టాల నుండి కాపాడుతారని డాక్టర్ రంగారావు అన్నారు. ప్రమాదాలపై ప్రజలు అవగాహనతో మెలగాలని అన్నారు. ఈనెల 21 వరకు వారోత్సవాలు జరుగుతాయని తెలిపారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న వై సాంబశివరావు

రేపల్లె : అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా కరపత్రాన్ని అగ్నిమాపక శాఖ అధికారి వై సాంబశివరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ప్రమాదం నుండి ఎలా తప్పించు కోవాలనే అంశాలపై విద్యార్థులతోపాటు ప్రజలకు వారం రోజులపాటు వివిధ ప్రాంతాలు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏదైన ఘటన జరిగినప్పుడు వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సిబ్బంది పాల్గొన్నారు.



వ్యాయామ పరికరాలు ప్రారంభిస్తున్న ఎస్పి

వ్యాయామంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - పర్చూరు

క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఎస్పి మాల్యాద్రి పేర్కొన్నారు. మండలంలోని నాగులపాలెంలోని వాకింగ్ పార్కులో రోటరీ క్లబ్ ఏర్పాటు చేసిన రెండు వ్యాయామ పరికరాలను ఆయన సోమవారం ప్రారంభించారు. ఆర్సిసి సభ్యులను ఆయన అభినందించారు. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్సిసి డైరెక్టర్ తేళ్ల రమేష్ చంద్ర, పి రాఘవయ్య, కొల్లా శ్రీనివాసరావు, చాగంటి నాగేశ్వరరావు, చాగంటి రామారావు, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు తోకల కృష్ణమోహన్, కోమటి ఆంజనేయులు, నాగభైరు శ్రీనివాసరావు, పోలిశెట్టి చంద్రశేఖరరావు, కొల్లా కొండలరాయుడు పాల్గొన్నారు.



అన్నదానం ప్రారంభిస్తున్న సతీష్ ప్రభాకర్

రథం బజార్లో అన్నదానం

ప్రజాశక్తి - బాపట్ల

శ్రీరామనవమి నవరాత్రుల ముగింపు సందర్భంగా పట్టణంలో రథం బజారులో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన అన్నసంతర్పణను మాజీ ఎంఎల్సి అన్నం సతీష్ ప్రభాకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రావినూతల విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - మేదరమెట్ల

ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో రావినూతల గ్రామానికి చెందిన రూపావతి దేవి 987 మార్కులు సాధించారు. ఆమె గుంటూరులోని క్రేన్ బ్రిడ్జి కాలేజీలో ఇంటర్మీడియట్ బైపిసి చదివించారు. ఆమె తండ్రి రాధాకృష్ణమూర్తి టీ కొట్టు నడుపుతుంటాడు. తన కుమార్తెకు 987 మార్కులు రావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.




రూపావతి దేవి (987)

నేటి నుండి రోజు మార్చి రోజు నీటి సరఫరా

ప్రజాశక్తి - బాపట్ల

నేటి నుండి పట్టణ ప్రజలకు రోజు మార్చి రోజు త్రాగునీరు అందించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు. మున్సిరక్షణ నగర్ వద్దగల చెరువులో నీటిమట్టం 24 అడుగులకు గాను 17 అడుగులు మాత్రమే ఉందని తెలిపారు. అందులో 8అడుగులు పూడిక ఉందని, ప్రస్తుతం చెరువులో 9 అడుగులు మాత్రమే నీటి సామర్థ్యం ఉన్న నేపథ్యంలో నీటిపారుదల శాఖ ఇరిగేషన్ ఛానల్ ద్వారా నీరు విడుదల చేసే వరకు మంగళవారం నుండి రోజు మార్చి రోజు నీటి సరఫరా చేయనున్నట్లు తెలిపారు. సాగర్ జలాలు కాల్వలకు వచ్చే వరకు ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని చెప్పారు. ప్రజలు నీటి పొదుపును పాటించి మున్సిపల్ అధికారులకు సహకరించాలని కోరారు.

సిపిఎం ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-చీమకుర్తి

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా కె.వి పాలెంలో సిపిఎం ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. సోమవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్ కె బాబు పూలమాల వేసి.. నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాతలు బొడ్డపాటి చెంచారావు సౌజన్యంతో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సిపిఎం రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభకు పొత్తూరి సురేష్ అధ్యక్షత వహించారు. ఎస్.కె మాబు, జాలా అంజయ్య మాట్లాడుతూ చలివేంద్రం దాత బొడ్డపాటి చెంచారావును అభినందించారు. కేంద్రం రాష్ట్రాల హక్కులు హరిస్తోందని, ప్రజల మధ్య చిచ్చు పెట్టడానికి మతాన్ని ముందుకు తీసుకొస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పమిడి వెంకట్రావు, పూసపాటి వెంకటరావు, మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, గ్రామ నాయకులు కొల్లూరు వెంకటేశ్వర్లు, పమిడి రామారావు, డి సుధాకర్, గ్రామ సర్పంచ్ బక్క శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ సోమినేని ప్రసాద్, గోరంట్ల ప్రసాదు, పుట్టా శీను, ఎర్రగుంట్ల వసంతరావు, బక్క రత్నం, దాసరి నరసింహారావు, దాసరి హనుమంతరావు, వేమా చిన్న కోటేశ్వరరావు, ఎం నర్సింగారావు, మోహన్, కే.అక్కయ్య, మాదాల శ్రీను పాల్గొన్నారు.

నాణ్యమైన సీడ్, ఫీడ్ ఇవ్వాలి

- విద్యుత్ యూనిట్ రూ.1.50కి ఇవ్వాలి
- జిల్లా రొయ్యి రైతు నాయకుల డిమాండ్
- కొత్త కమిటీ ఏకగ్రీవ ఎన్నిక


మాట్లాడుతున్న ఏడీ ఎస్.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోని రొయ్యల సాగు చేసే రైతులకు నాణ్యమైన సీడ్‌తో పాటుగా ఫీడ్ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లాలోని రొయ్యి రైతులు ప్రభుత్వాన్ని కోరారు. ఒంగోలు బందావనం ఫంక్షన్ హాల్ లో ఉమ్మడి ప్రకాశం జిల్లా రొయ్య రైతు సంక్షేమ సంఘం జిల్లా సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రొయ్య రైతు నాయకులు మార్నేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 1995 నుండి జిల్లాలో రైతులు రొయ్యల సాగు చేస్తున్నారన్నారు. ఏ కొద్ది మందికి తప్పిస్తే ఎక్కువ భాగం రైతులు నష్టపోయి ఆస్తులు అమ్ముకున్న వారేనన్నారు. ప్రభుత్వం రొయ్యల సాగును అభివృద్ధి చేయాలని ఒకవైపు పిలుపునిస్తున్న అందుకు తగిన వనరులు కల్పించటంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మొదట దఫాలో ఇచ్చిన సీడ్, రెండవ దఫాలో తగిన నాణ్యతతో ఇవ్వటం లేదని ఆరోపించారు. ఈదర యశ్వంత్ కుమార్ మాట్లాడుతూ సబ్సిడీపై విద్యుత్ యూనిట్ రూ. 1.50 కి ఇవ్వాలని డిమాండ్ చేశారు. చిన్న రైతులు విద్యుత్ ప్యానెల్ బోర్డులు ఏర్పాటు చేసుకోవడం చాలా ఖర్చుతో కూడిన పని అన్నారు. ఆక్వా సాగులో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలని కోరారు. ఒంగోలు మత్స్య శాఖ సహాయ సంచాలకులు ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ త్వరలో రొయ్య రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై త్వరలో అప్సడా రాష్ట్ర వైస్ చైర్మన్, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రైతు కిలారి హరిబాబు మాట్లాడుతూ రొయ్య ధరలు ముందస్తుగా రైతులకు ప్రభుత్వం చెప్పటంతో రైతులు నష్టాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమానికి జిల్లాలో 9 మండలాల నుండి రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొత్త కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

ఉమ్మడి ప్రకాశం జిల్లా రొయ్య రైతుల సంక్షేమ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా మార్నేని వెంకటేశ్వర్లు, అధ్యక్షులుగా ఈదర యశ్వంత్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా కిలారి హరిబాబు, కోశాధికారిగా ఏడుగుండ్ల కృష్ణమూర్తి, మరో 30 మందిని సభ్యులుగా ఎన్నిక్కయ్యారు.

అగ్నిప్రమాదాలు జరగకుండా చర్యలు

కలెక్టర్ వెంకటమురళి


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

వేసవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి చెప్పారు. అగ్ని మాపక వారోత్సవాలకు సంబంధించిన గోడ పత్రాలను స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సోమవారం విడుదల చేశారు. 14 నుంచి 20 తేదీ వరకు జరగనున్న అగ్నిమాపక వారోత్సవాలలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక సేవల శాఖ అధికారి సి.మాధవ నాయుడు, ఫైర్ ఆఫీసర్ వై వెంకటేశ్వరరావు, డిపిఒ ప్రభాకర్, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ రామకృష్ణ, ఎల్‌డిఎం శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక, ఆర్థిక సాధికారతతోనే సమానత్వం

- బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్
- అంబేద్కర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

సామాజిక, ఆర్థిక సాధికారతతోనే సమానత్వం లభిస్తుందని ఉద్యమాలు చేసిన గొప్ప నాయకుడు అంబేద్కర్ అని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ చెప్పారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి కార్యక్రమం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో సోమవారం ఘనంగా జరిగింది. అంబేద్కర్ జయంతి వేడుకల ప్రారంభ సూచికగా ఎంపీ కృష్ణప్రసాద్, కలెక్టర్ వెంకటమురళి జ్యోతి వెలిగించారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ చిత్రపటానికి పుష్పమాలలతో ఘనంగా నివాళులర్పించారు. అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినీలు జై భీమ్, జై భీమ్ అంబేద్కర్ అంటూ కోలాట నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యనభ్యసించి బైపిసిలో 975 మార్కులు సాధించిన చీరాల ఎస్సీ విద్యార్థినీ కె ధాత్రి, పర్చూరుకి చెందిన విద్యార్థిని ఎంపీసీలో 975 మార్కులు సాధించిన సమీరా లకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున నగదు బహుమతులను కలెక్టర్ అందజేశారు. యాజిలి గ్రామంలోని నీటి కుంటలో పడి ఇటీవల మతి చెందిన ఎస్సి బాలుడు జె ప్రవీణ్ కుటుంబానికి కలెక్టర్ ఆర్థిక సహకారం అందించారు. రూ.10 వేల ఆర్థిక సాయాన్ని మృతుడి తల్లి అమృతకు చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పేదరికాన్ని రూపుమాపాలని పి-4 విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కలెక్టర్ జె వెంకట మురళి మాట్లాడుతూ పేదరికం, అంటరానితనాన్ని ధైర్యంగా ఎదుర్కొన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విద్యతో మేధావిగా చరిత్రలో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కమిటీ ఏర్పాటులో రాజకీయ పార్టీలకు అతీతంగా సభ్యులను నియమిస్తామని, తక్షణమే కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సూర్యలంక బీచ్ వద్ద ఎస్సీ మహిళలు దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేక గది నిర్మిస్తామన్నారు. ఇంటర్మీడియట్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు ముందుగా ప్రకటించినట్లు నగదు బహుమతి ఇస్తామన్నారు. బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ భారత దేశానికి కోహినూరు వజ్రం కంటే విలువైన వ్యక్తి అంబేద్కర్ అని చెప్పారు. కార్యక్రమంలో శాసనమండలి సభ్యురాలు పోతుల సునీత, బుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి రాజా దెబోరా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, డిపిఒ ప్రభాకర్, బాపట్ల ఆర్డీవో పి గ్లోరియా, ఎస్సీ నాయకులు జి.చార్వాక, మాణిక్యరావు, లక్ష్మీ నరసయ్య, పల్నాడు శ్రీరాములు, ఎస్సీ నాయకులు ఎస్ మోహన్ కుమార్ ధర్మ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి వేడుకలు

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలను ప్రభుత్వం సోమవారం ఘనంగా నిర్వహించింది. స్థానిక గడియార స్తంభం సమీపంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహానికి బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్, జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ, జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, బుడా ఛైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, జిల్లా అధికారులు, పలువురు ఎస్సీ సంఘాల నాయకులు పుష్ప మాలలతో ఘనంగా నివాళులర్పించారు. జయంతి కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ జీవిత ఘట్టాలపై ఫోటోల ప్రదర్శనను అతిథులు తిలకించారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, జిల్లా అధికారులు, ఎస్సీ సంఘాల నాయకులు జి.చార్వాక, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో..

ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు.

ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ వద్ద

ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి ప్రతిపాదనలు

- పంట భూములకు జరిగే నష్టం గురించి పట్టించుకోని నిపుణులు
- ప్రతిపాదిత ఫిషింగ్ హార్బర్ వల్ల వేలాది ఎకరాలు బీడు భూములయ్యే దుస్థితి


ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్‌లో నిలిపి ఉంచిన బోట్లు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలోని చీరాల వాడరేవులో రూ.450 కోట్లతో ఫ్లోటింగ్ హార్బర్ రెండేళ్ళ క్రితం మంజూరైంది. నీటిపై తేలియాడే విధానంలో నిర్మించే ఫ్లోటింగ్ జెట్టీ తరహా ఫిషింగ్ హార్బర్ నిర్మాణం జరగాల్సి ఉంది. 2023 మే 15న అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శంఖుస్థాపన కూడా చేశారు. ఇందుకోసం వాడరేవు సముద్రపు ఒడ్డున ఉన్న 19 ఎకరాల భూమిని హార్బర్ కోసం కేటాయించారు. గతంలోనే టెండర్లు కూడా ఖరారు అయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో హార్బర్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నట్లు చెప్పారే తప్ప పనులు చేపట్టలేదు. నాబార్డు నిధుల మంజూరుతో పాటు, రాష్ట్రం వాటా నిధుల విడుదలలో జరిగిన జాప్యం కారణంగా ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిధులు సర్దుబాటు అయ్యే పరిస్థితి లేకపోవడంతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణ వ్యయాన్ని మూడో వంతుకు కుదించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా లోకాస్ట్ ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కోసం నూతన ప్రతిపాదనలు సిద్ధం చేయమని ప్రభుత్వ పెద్దలు చెప్పారు. ఈ మేరకు నిపుణుల బృందం చీరాల-వాడరేవు తీరప్రాంతంలో పరిశీలన జరిపారు. గతంలో రూపొందించిన ప్రతిపాదనల ప్రకారం ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కోసం సముద్రం ఒడ్డు నుంచి లోపలికి భారీ ఎత్తున కొండరాళ్లతో గోడల నిర్మాణం జరపాల్సి ఉంది. ఇలా దాదాపు కిలోమీటరు పైగా సముద్రంలో నిర్మాణాలు జరపాలి. ఇందుకోసమే దాదాపు రూ.200 కోట్ల అధిక వ్యయం అవుతుంది. అలా కాకుండా వాడరేవు సమీపంలో ఉన్న ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ కాలువను పడవల రాకపోకలకు అనుకూలంగా విస్తరించి జెట్టీల నిర్మాణాలు జరపడం ద్వారా ఫిషింగ్ హార్బర్ నిర్మాణం ఖర్చు తగ్గించవచ్చని ప్రతిపాదించారు. ఇలా చేయడం వల్ల నిర్మాణవ్యయం రూ.200 కోట్లకు తగ్గించవచ్చని అంచనా వేశారు. సముద్ర ముఖద్వారం నుంచి ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ కాలువను ఒకటిన్నర కిలోమీటర్ల ఇందుకోసం వినియోగంలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

కానీ ఫిషింగ్ హార్బర్ నిర్మాణ వ్యయం ఖర్చు తగ్గించడంపైనే దృష్టి పెట్టిన నిపుణులు ఈ పద్ధతి వల్ల పంట పొలాలకు జరిగే నష్టం గురించి ఆలోచన చెయ్యలేదు. ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్‌ను ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కోసం వినియోగించుకునే క్రమంలో దాన్ని లోతుగా రెండు వైపులా విస్తరించాల్సి ఉంది. ఇలా చేస్తేనే పెద్ద బోట్లు లోపలికి వచ్చి లంగరు వేయగలరు. ఈ కారణంగా సముద్రపు ఉప్పు నీరు ఎగువకు చేరుతుంది. ఆటుపోటుతో సంబంధం లేకుండా దాదాపు బుర్లవారిపాలెం నుంచి ఈపురుపాలెంవరకు సముద్రపునీరు చేరుతుంది. స్ట్రయిట్‌కట్‌పై వేలాది ఎకరాలకు సాగు నీరందించే ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మారతాయి. స్ట్రయిట్‌కట్‌కు దారి తీసే పలు మురుగు కాలువల ద్వారా ఎగువకు సముద్రపు నీరు ఎక్కుతుంది. చీరాల, వేటపాలెం మండలాల పరిధిలోని భూగర్భ జలాలు ఉప్పుమయం అవుతాయి. పంట భూములకు సాగునీరు, ప్రజలకు తాగునీరు లభించే పరిస్థితి ఉండదు. దీంతో పాటు ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కోసం కనీసం 20 ఎకరాల భూములు అవసరం. ప్రతిపాదిత ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ సముద్రంలో కలిసే ప్రాంతంలో ఆ చుట్టుపక్కల ప్రభుత్వ భూములు లేవు. అటవీ శాఖకు చెందిన భూములు మాత్రమే ఉన్నాయి. ముందుగా అనుకున్న ప్రకారం రూ.450 కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం జరిగితే దీనికి అనుబంధంగా ఒడ్డున చేపల వేలం కోసం ప్లాట్‌ఫారాలు, ఐస్ ప్లాంట్, కోల్డ్ స్టోరేజీ యూనిట్, సోలార్ వ్యవస్థ, ఆయిల్ బంకు, పడవల మరమ్మత్తుల కోసం పెద్ద షెడ్లు అందుబాటులోకి వచ్చేవి. కానీ సవరించిన ప్రతిపాదనలు కారణంగా ఏ తరహా హార్బర్ నిర్మాణం జరుగుతుందో అర్థం కాదు. ఇప్పటికే చీరాల సమీపంలోని నిజాంపట్నంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు 80 శాతం వరకు అయ్యాయి. పర్చూరు నియోజకవర్గంలోని మోటుపల్లి ,పెదగంజాం వద్ద ఓడల తయారీ పరిశ్రమ, గ్రీన్‌ఫీల్డ్ హార్బర్ ప్రతిపాదనలు ఉన్నాయి. ప్రకాశం జిల్లా, కొత్తపట్నం వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కోసం అనుమతులు వచ్చాయి. ఇప్పుడు ప్రతిపాదిస్తున్న ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ వద్ద ఫిషింగ్ హార్బర్‌కు చాలా ఆటంకాలు ఉన్నాయి. నూతన ప్రతిపాదనల వల్ల వేలాది ఎకరాల పంట పొలాలు బీడు భూములవుతాయి. ఈ విషయమై ప్రజాప్రతినిధులు, అధికారులు ఆలోచన చేయాల్సి ఉంది. రైతులకు, పంటభూములకు నష్టం లేకుండా ఫిషింగ్ హార్బర్ నిర్మాణంపై దృష్టిపెట్టాల్సి ఉంది.